క్లుప్తంగా

ఆకట్టుకున్న దీపారాధన



కె.వెంకటాపురంలో దీపారాధన

కోటవురట్ల: కె.వెంకటాపురంలో వినాయక చవితి ఉత్సవాలలో భాగంగా గురువారం రాత్రి దీపారాధన కార్యక్రమం నిర్వహించారు. స్వస్తిక్, ఓంకారం, గణపతి ఆకారాలలో చేపట్టిన దీపారాధన కనువిందు చేసింది. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిని చాటుకున్నారు.

పాము కాటుతో రైతు మృతి



రుద్ర అప్పల నాయుడు (ఫైల్)

మునగపాక: పాము కాటుకు గురై మునగపాకకు చెందిన ఆడారి రుద్ర అప్పలనాయుడు(46) గురువారం రాత్రి మృతి చెందాడు. సాయంత్రం ఎప్పటిలాగానే పొలం పనులు చేస్తుండగా పాము కాటు వేసింది. దీంతో ఆయన కేకలు వేయడంతో స్థానికులు వచ్చి అనకాపల్లి వంద పడకల ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. దీంతో ఇంటి పెద్ద దిక్కుగా నిలిచిన అప్పలనాయుడు మృతితో కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ పి.ప్రసాదరావు కేసు నమోదు చేసి మృతదేహాన్ని అనకాపల్లి వంద పడకల ఆసుపత్రికి తరలించారు. శవ పంచనామా అనంతరం శుక్రవారం కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు. మృతుడు అప్పలనాయుడుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

హైస్కూల్‌లో వసతుల కల్పనకు కృషి

మునగపాక: మునగపాక జెడ్పీ హైస్కూల్‌లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తామని స్కూల్ కమిటీ చైర్మన్ ఆడారి సూర్యచంద్రరావు తెలిపారు. కొంత కాలంగా నిరుపయోగంగా ఉన్న మంచినీటి బోరును శుక్రవారం బాగు చేసి అందుబాటులోకి తీసుకొచ్చారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు తాగునీటి సౌకర్యం కల్పిస్తామన్నారు. హెచ్ఎం శ్రీనివాసరావు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పాములవాకలో జంగిల్ క్లియరెన్స్



పిచ్చిపాదలను తొలగిస్తున్న దృశ్యం

కోటవురట్ల: పాములవాకలో శుక్రవారం పిచ్చిమొక్కల తొలగింపు కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు, సర్పంచ్ డి.సత్యవతి ఆధ్వర్యంలో ఎస్సీ కాలనీ నుంచి చెరువు వరకు తుప్పలను తొలగించారు. గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు జేసీబీతో జంగిల్ క్లియరెన్స్ చేపట్టినట్టు శ్రీనివాసరావు తెలిపారు. వీధులు, రహదారుల్లో పేరుకుపోయిన చెత్తను కూడా తొలగించామన్నారు.

అచ్యుతాపురం ఎస్ఐగా సుధాకరరావు



సుధాకరరావు

అచ్యుతాపురం(మునగపాక): అచ్యుతాపురం ఎస్ఐగా కల్లేపల్లి సుధాకరరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. నర్సీపట్నం టౌన్ ఎస్ఐగా పని చేసిన ఆయనను అచ్యుతాపురం స్టేషన్‌కు బదిలీ చేశారు. ఈ మేరకు బాధ్యతలు చేపట్టిన ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణతో పాటు ఫ్రెండ్లీ పోలీసింగ్ అమలుకు కృషి చేస్తానన్నారు. మండల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని చెప్పారు.

పీహెచ్‌సీలో సదుపాయాలపై ఆరా



మంగవరం పీహెచ్‌సీని పరిశీలిస్తున్న టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యులు

పాయకరావుపేట: మండలంలోని మంగవరం పీహెచ్‌సీని జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యులు పరిశీలించారు. ఆస్పత్రిలో గర్భిణులు, పిల్లలకు అందుతున్న ఆరోగ్య సేవలపై వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పాఠశాల విద్యార్థులకు ఎనిమియా పరీక్షల నిర్వహణపై ఆరా తీశారు. సీజనల్ వ్యాధులు రాకుండా చర్యలు తీసుకోవాలని వైద్య సిబ్బందికి సూచించారు. టాస్క్‌ఫోర్స్ బృందం జిల్లా అధికారులు జగదీష్, ఎస్‌వో రామచంద్రరావు, జనార్దన్, సూపర్‌వైజర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

100 రోజుల పాలన.. చేసింది సున్నా..

కూటమి ప్రభుత్వానికి వంద రోజులు నిండాయి. ఏదో చేసేస్తారని ఎంతో ఊహించుకున్న రాష్ట్ర ప్రజలకు తీవ్ర నిరాశే ఎదురైంది. 40 ఏళ్ల అనుభవం అంటూ తరచూ చెప్పుకునే చంద్రబాబు మరోసారి తన మార్కు మోసాన్ని ప్రజలకు చూపించారు. మైక్ ముందు పూనకంతో ఊగిపోయే పవన్‌కల్యాణ్ పదవి దక్కాక గొంతుమూగబోయింది. చంద్రబాబు ఏం చేసినా ఆహా..ఓహో.. మీ తెలివి అమోఘం అనడం మినహా.. ప్రజల తరపున డిప్యూటీ సీఎంగా కూటమిలో ఉండి చేసిందేమీ లేదు. కూటమి ప్రభుత్వం చేసింది గోరంతైతే ఊదరగొట్టేది కొండంత. సూపర్ సిక్స్ మాటే వినిపించడంలేదు. తల్లికి వందనం మాయమైంది. రైతు భరోసాకు ఎగనామం పెట్టారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఎపుడో తెలియదు. ఇదిగో ఉచిత గ్యాస్ సిలిండర్ ఇచ్చేస్తున్నామంటూ ఊరింపు మొదలైంది.



పిల్లర్ల స్థాయిలోనే ఉన్న పండూరు వంతెన

- హామీలను గాలికి వదిలేసిన కూటమి ప్రభుత్వం
- ఇది మంచి ప్రభుత్వం కాదు.. ముంచేదని ప్రజల నిట్టూర్పు



అభివృద్ధికి నోచని కోటవురట్ల- అడ్డురోడ్డు రహదారి

కోటవురట్ల: కూటమి వంద రోజుల విధ్వంసకర పాలనలో రాష్ట్ర ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. సంక్షేమం ఉసురు తీశారు. కక్షలు, దాడులతో రాష్ట్రం అట్టుడుకుపోయింది. మహిళలకు రక్షణ లేకుండా పోయింది. లైంగిక దాడులు పెరిగాయి. దుశ్శాసన పర్వాలు చూపించారు. కూటమి ప్రభుత్వం చాలా చేసేస్తుందని ఊహించుకున్న వారంతా అయోమయంలో పడిపోయారు. కూరగాయల ధరలు మండిపోయాయి. నిత్యవసర ధరలకు రెక్కలొచ్చాయి.

హోం మినిస్టర్ హామీలు తూచ్

ఎన్నికల ముందు హోం మినిస్టర్ అనిత పాయకరావుపేట నియోజకవర్గానికి వరాలు కురిపించారు. తమ కూటమి ప్రభుత్వం వస్తే నియోజకవర్గం రూపురేఖలు మార్చేస్తామన్నారు. మహిళ రక్షణ అంటూ ఉపన్యాసాలు దంచేసేవారు. వంద రోజుల పాలనలో హోం మినిస్టర్ తన సొంత నియోజకవర్గంలో ఒక్క హామీని కూడా నెరవేర్చలేకపోయారు. పాత హామీల మాట అటుంచితే కొత్త సమస్యలు పుట్టుకొచ్చాయి. కోటవురట్ల మండలంలో పండూరు వంతెన నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. రామచంద్రపురం జంక్షన్ నుంచి ఎస్.రాయవరం మండలం అడ్డురోడ్డు వరకు ప్రధాన ఆర్అండ్‌బీ రహదారిని అభివృద్ధి చేస్తామన్నారు. ఉద్దండపురంలో మంచినీటి ప్రాజెక్టు గ్రిడ్‌ను నిర్మిస్తామన్నారు. పాయకరావుపేట పట్టణంలో మెయిన్‌రోడ్డును విస్తరించి రెండు లైన్ల రోడ్డుగా అభివృద్ధి చేస్తామన్నారు. నక్కపల్లిలో కొత్తగా మంజూరైన డిగ్రీ కళాశాలకు భవన సముదాయం నిర్మిస్తామన్నారు. వీటిలో ఒక్క హామీ కూడా 100 రోజుల పాలనలో మోక్షానికి నోచుకోలేదు. పాత హామీలు ఇలా ఉండగానే కోటవురట్ల మండలంలోని రామచంద్రపురం జంక్షన్‌లో మినీ వంతెన శిథిలమై కుంగిపోవడంతో రాకపోకలు బంద్ అయ్యాయి. ఇక్కడ కొత్త వంతెన నిర్మించాల్సి ఉంది. అయితే తాత్కాలికంగా పక్కనే డైవర్షన్ రోడ్డును నిర్మించి చేతులు దులిపేసుకున్నారు. ఇందేశమ్మవాక ఘాట్‌రోడ్డులో సగానికి వరాహనదిలోకి జారిపోయింది. దాంతో ఇక్కడ పూర్తిగా భారీ వాహనాల రాకపోకలు బంద్ అయ్యాయి. ఘాట్‌రోడ్డును విస్తరిస్తే కానీ బస్సులు, లారీలు, ఇతర వాహనాలు వెళ్లే అవకాశం లేదు. వీటిపై హోం మినిస్టర్ అనిత ఎటువంటి హామీ ఇవ్వలేదు. ఇక దాడుల విషయానికి వస్తే కైలాసపట్నం మర్రిచెట్టు ప్రాంతంలో ఇద్దరు ఒంటరి మహిళలపై టీడీపీ నాయకులు దాడికి పాల్పడి దుశ్శాసనపర్వాన్ని గుర్తుచేశారు. పి.కె.పల్లిలో వైఎస్సార్ సీపీ కార్యకర్త కారు అద్దాలు పగలగొట్టి, షాపుపైకి రాళ్లు రువ్వారు. ఇదే తరహాలో ఎస్.రాయవరంలోనూ వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై దాడులకు పాల్పడ్డారు. ఈ వంద రోజుల పాలనలో కూటమి ప్రభుత్వం హర్రర్ సినిమాను చూపించింది.

వంద రోజుల్లో చేసిందేమీ లేదు..



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులవుతున్నా ప్రజలకు చేసిందేమీ లేదు. ఇచ్చిన హామీలను గాలికొదిలేశారు. ప్రజలను బూటకపు హామీలతో మోసం చేశారు. ఏం చేశారని వంద రోజుల సెలబ్రేషన్స్.. కనీసం నియోజకవర్గానికి ఇచ్చిన హామీలను కూడా నెరవేర్చలేదు.

– బీమిరెడ్డి రామకృష్ణ, కె.వెంకటాపురం

రహదారుల అభివృద్ధి ఎక్కడ?



గత ప్రభుత్వంలో రహదారులపై తెగ విమర్శలు చేసేవారు. కూటమి ప్రభుత్వం రాగానే రహదారులను అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. నియోజకవర్గానికి చాలా హామీలు గుప్పించారు. రామచంద్రపురం జంక్షన్ నుంచి అడ్డురోడ్డు వరకు రూ.కోట్లు ఖర్చు చేసి రోడ్డు నిర్మిస్తామన్నారు. ఇపుడు ఆ ఊసే లేదు. పైగా ఇందేశమ్మవాక ఘాట్‌రోడ్డు మూతపడింది. ఇంకెందుకు వంద రోజుల సంబరాలు.

– కొరుప్రోలు రమణ, కె.వెంకటాపురం

పండూరు వంతెన పూర్తవుతుందా?



పండూరు వంతెన నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. ప్రభుత్వం వచ్చి వంద రోజులైంది. వంతెన నిర్మాణంపై ఎటువంటి ప్రస్తావన లేదు. వరాహనది పొంగి ప్రవహిస్తే మా ఊరికి రాకపోకలకు చాలా ఇబ్బంది కలుగుతోంది. ఇటీవలే నదిని దాటుతూ ఒకరు గల్లంతయ్యారు. ప్రభుత్వం వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి.

– టి.నారాయణరావు, పండూరు

ఇదే ముంచే ప్రభుత్వం

- కూటమి వంద రోజుల పాలనపై సర్వత్రా అసంతృప్తి
- హామీలను పట్టించుకోని యలమంచిలి ఎమ్మెల్యే విజయకుమార్





యలమంచిలి రూరల్: బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ అంటూ సూపర్ సిక్స్ పేరిట ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టోతో టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చింది. కూటమి ప్రభుత్వం ఏర్పడి 100 రోజులైంది. కానీ ఇప్పుడు ఎన్నికల ముందు ఇచ్చిన హామీల ఊసెత్తడం లేదు. శ్వేతపత్రాల పేరుతో గారడీ చేస్తూ ప్రజలకు చుక్కలు చూపిస్తున్నారు. హామీలు అమలు చేయకపోవడంపై ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

పూడిమడక హార్బర్ ఎక్కడ?

మే 1, 2024 వారాహి యాత్రలో భాగంగా జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ నియోజకవర్గంలోని అచ్యుతాపురంలో ఎన్నికల ప్రచార సభ నిర్వహించారు. పార్టీ అభ్యర్థి సుందరపు విజయ్‌కుమార్‌ను గెలిపించాలంటూ యలమంచిలి నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు హామీలిచ్చారు. అచ్యుతాపురం మండలం పూడిమడకలో ఫిషింగ్ హార్బర్ ఏర్పాటు చేస్తామన్నారు. అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల్లో విస్తరించి ఉన్న ప్రత్యేక ఆర్థిక మండలి(సెజ్) ఏర్పాటు కోసం సుమారు 4వేల ఎకరాల భూములిచ్చిన 26 గ్రామాల రైతులకిచ్చిన హామీలను నెరవేర్చుతామన్నారు. ఇందు కోసం అసెంబ్లీలో సుందరపు విజయ్‌కుమార్‌తో పాటు తాను కూడా రైతుల గళమై నిలబడతామని భరోసా ఇచ్చారు. యువత అభిరుచిని బట్టి ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. ఇవేవీ 100 రోజుల్లో మాటల్లోనైనా అమల్లోకి రాలేదు.

నారా లోకేష్‌కిచ్చిన వినతి పత్రాలెక్కడ?

యువగళం పాదయాత్రలో భాగంగా ప్రస్తుత విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నియోజకవర్గంలో పర్యటిస్తూ ఎక్కడికక్కడ ప్రజల నుంచి వందల సంఖ్యలో వినతి పత్రాలు తీసుకున్నారు. ముఖ్యంగా రహదారులు దారుణంగా ఉన్నాయంటూ నానా హడావుడి చేశారు. నియోజకవర్గంలో సెజ్ పరిశ్రమల్లో 70 శాతం స్థానికులకే ఉద్యోగాలు కల్పించేలా చూస్తామని హామీ ఇచ్చారు. తీరా అధికారంలోకి వచ్చి 100 రోజులైనా ఇచ్చిన హామీలతో పాటు ప్రజల నుంచి స్వీకరించిన వినతి పత్రాల ఊసెత్తడంలేదు.

- అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతుకు ఏడాదికి రూ.20 వేలు ఇస్తామని ప్రకటించింది. నియోజకవర్గంలో 34,907 మంది రైతులకు రూ.69.81 కోట్లు ఇవ్వాల్సి ఉంది. ఇప్పటికే ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండు నెలలు గడిచిపోయిందని, వెంటనే నిధులు విడుదల చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.
- అమ్మ ఒడి పథకం కింద నియోజకవర్గంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2019 నుంచి ఐదేళ్లలో కుటుంబానికి ఒకరికి రూ.15 వేలు చొప్పున నియోజకవర్గంలో 93,944 మంది తల్లుల ఖాతాల్లో రూ.140.91 కోట్లు జమ చేశారు. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఇంట్లో ఒకటి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికీ తల్లికి వందనం పేరుతో ఒక్కొక్కరికీ రూ.15 వేలు చొప్పున ఇస్తామని హామీ ఇచ్చింది. ఇప్పటివరకూ ఆ ఊసెత్తకపోవడంతో నియోజకవర్గంలో 93,944 మంది తల్లులు తమ పిల్లల ఫీజులు,ఇతర ఖర్చుల కోసం ఇబ్బంది పడుతున్నారు.
- నియోజకవర్గంలో సుమారుగా 77,952 కుటుంబాలున్నాయి. ఇంటికో ఉద్యోగం చొప్పున సుమారుగా 77 వేల మందికి ఉద్యోగాలివ్వాల్సి ఉంటుంది. లేదా నిరుద్యోగ భృతి కింద నెలకు రూ.3 వేలు చొప్పున రూ.23.38 కోట్లు అవసరమౌతాయి.
- మహిళలకు ప్రతి నెలా రూ.1500 ఇస్తామన్నారు. నియోజకవర్గంలో సుమారు 67,608 మందికి ఈ పథకం ద్వారా నెలనెలా నగదు అందించాల్సి ఉంది. ఇందుకోసం సుమారు రూ.10.14 కోట్లు అవసరం. ప్రస్తుతానికి ఈ పథకం అమలుపై ఎలాంటి కదలిక లేదు.కనీసం ఎప్పట్నుంచి అమలు చేస్తారో కూడా ప్రభుత్వ పెద్దలు నోరు మెదపడం లేదు.

ఉద్యోగం లేదా.. నిరుద్యోగ భృతి ఇవ్వాలి



నేను, మా చెల్లి ఇద్దరం బీఎస్సీ వరకు చదువుకున్నాం. డిగ్రీ పాసైనా ఉద్యోగాలు లేకపోవడంతో ఏం చేయాలో తెలియడంలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే నిరుద్యోగులకు నెలకు రూ.3 వేల చొప్పున భృతి ఇస్తామన్నారు. ఇంటికో ఉద్యోగం కూడా కల్పిస్తామన్నారు. కానీ ప్రభుత్వం ఏర్పడి 100 రోజులవుతున్నా నిరుద్యోగ భృతి ఇవ్వలేదు. ఉద్యోగాల కల్పన ఊసెత్తడంలేదు. తక్షణం నిరుద్యోగ భృతి పథకాన్ని అమలు చేయాలి.

– షేక్ ఆసియా, గాంధీనగరం, యలమంచిలి పట్టణం

శ్రీదేవి తల్లి ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం

మునగపాక: ఉమ్మలాడలో శ్రీదేవి తల్లి అమ్మవారి ఆలయ నిర్మాణానికి స్థానిక ఎంపీటీసీ సభ్యురాలు మొల్లేటి కృష్ణవేణి, నారాయణరావు దంపతులు రూ.లక్ష విరాళంగా అందజేశారు. ఈ మేరకు శుక్రవారం ఆలయ కమిటీ చైర్మన్ పల్లె అప్పలనాయుడుకు వారు విరాళం అందించారు. దీంతో కమిటీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేత మొల్లేటి శంకర్, కరోతి విజయకుమార్, ఆటో శ్రీను, నరసింగరావు, తదితరులు పాల్గొన్నారు.



రూ.లక్ష విరాళం అందజేస్తున్న ఎంపీటీసీ కృష్ణవేణి నారాయణరావు దంపతులు

సంక్షోభంలోనూ సంక్షేమం : ఎమ్మెల్యే విజయ్‌కుమార్


యలమంచిలి రూరల్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలనలో సంక్షోభంలో సంక్షేమం సాధించిందని ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ అన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. మున్సిపాలిటీ పరిధి 23వ వార్డు కొక్కిరాపల్లిలో శుక్రవారం సాయంత్రం జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉన్నా ఇచ్చిన హామీలను అమలు చేస్తున్న ప్రభుత్వానికి అందరూ మద్దతునివ్వాలని కోరారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలతో కూడిన కరపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు, వివిధ శాఖల అధికారులు, వార్డు కౌన్సిలర్ రామకృష్ణ, బొద్దపు శ్రీను, గొర్లె నానాజీ, రాజాన నారాయణమ్మ, కొటారు సాంబ, కరణం రవి, పెయ్యల రామకృష్ణ, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

విజన్-2047పై వర్క్‌షాప్

యలమంచిలి రూరల్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు శుక్రవారం యలమంచిలి మండల పరిషత్ కార్యాలయంలో విజన్ 2047 ప్లాన్ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌లో మండల జనాభా ప్రకారం 2027 వరకు అవసరమైన కనీస మౌలిక సదుపాయాలు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులు చర్చించారు. ముఖ్యంగా గణాంక శాఖ సూచనల మేరకు అధికారులు సిద్ధం చేయాల్సిన వివరాలు, ఇతర నివేదికల గురించి చర్చించారు. ఈ సమావేశంలో డిప్యూటీ స్టాటిస్టికల్ అధికారి శశికళ, సహాయ గణాంక అధికారి సునీత, ఈవోపీఆర్డీ ప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ మురళీబాబు, మండల ఇంజినీర్ సోమశేఖర్, ఏఈలు, ఇతర మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో అప్పలనాయుడు

విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు

మునగపాక: తోటాడ పంచాయతీ పరిధిలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని సర్పంచ్ దొడ్డి మంగవేణి కోటేశ్వరరావు తెలిపారు. తోటాడ పంచాయతీ శివారు గవర్ల అనకాపల్లిలో పాడైన వీధి దీపాలకు శుక్రవారం మరమ్మతులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తోటాడ పంచాయతీలో పారిశుధ్యం, తాగునీరు, వీధి దీపాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. కూటమి నాయకులు పొలమరశెట్టి మురళి, చదరం భాస్కరరావు, పంచాయతీ కార్యదర్శి కాండ్రేగుల లక్ష్మీనారాయణ, సచివాలయ ఉద్యోగి నాయుడు పాల్గొన్నారు.

25న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

రాంబిల్లి(యలమంచిలి): రాంబిల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఈ నెల 25న జరగనుంది. ఎంపీపీ గొట్టుముక్కల శిరీష అధ్యక్షతన ఈ సమావేశం జరుగుతుందని ఎంపీడీవో కొండలరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి మండలంలో అన్ని గ్రామల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ప్రభుత్వ అధికారులు హాజరు కావాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

యలమంచిలి రూరల్: పట్టణంలో 33/11కేవీ విద్యుత్ ఉపకేంద్రం 11కేవీ టౌన్-4 ఫీడర్ పరిధిలో ట్రాన్స్‌ఫార్మర్ మార్పు, విద్యుత్ లైన్ల మరమ్మతు పనుల నిమిత్తం శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు అనకాపల్లి ఏపీఈపీడీసీఎల్ ఈఈ రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. మిలట్రీ కాలనీ, కొత్తపేట, గుంటూరువారి వీధి, యాతపేట ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



ఉమ్మలాడలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

మునగపాక: ఉమ్మలాడలో శుక్రవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ప్రధాని మోదీ జన్మదిన వేడుకల్లో భాగంగా బీజేపీ నాయకులు మళ్ల కాలేశ్వరరావు, జ్యోతీష్ కుమార్, మొల్లేటి జగదీశ్వరరావు, గణేష్‌ల ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరాన్ని పార్టీ జిల్లా అధ్యక్షులు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కొండబాబు ప్రారంభించారు. 350 మందికి వైద్యులు పరీక్షలు, అవసరమైన మందులు అందజేశారు.

ఫ్రీహోల్డ్ అసైన్‌మెంట్ పూర్తి చేయాలి

కోటవురట్ల: ఫ్రీహోల్డ్ అసైన్‌మెంట్‌ను త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్డీవో వి.జయరాం ఆదేశించారు. తహసీల్దారు కార్యాలయాన్ని ఆయన శుక్రవారం సందర్శించి, ఫ్రీహోల్డ్ అసైన్‌మెంట్‌పై సమీక్ష చేశారు. డీ పట్టా తీసుకున్న రైతుల ఆధీనంలోనే భూములు ఉన్నాయా? చేతులు మారాయా? పూర్తి నివేదిక ఇవ్వాలన్నారు. 2003 ముందు డీ పట్టా పొందిన రైతులను ఫ్రీహోల్డ్ అసైన్‌మెంట్ ద్వారా 22ఏ నుంచి తప్పించిన రైతుల వివరాలు పూర్తి స్థాయిలో విచారణ చేయాలన్నారు. ఇందు కోసం కోటవురట్ల మండలానికి నర్సీపట్నం, నాతవరం తహసీల్దార్లను ప్రత్యేక విచారణ అధికారులుగా నియమించినట్టు తెలిపారు. నివేదికను మంగళవారం నాటికి సిద్ధం చేయాలన్నారు. తహసీల్దారు జానకమ్మ, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్డీవో జయరాం

ఉత్సాహంగా స్కూల్ గేమ్స్



కోటవురట్లలో కబడ్డీ ఆడుతున్న విద్యార్థినులు



కొరుప్రోలు ఉన్నత పాఠశాలలో వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

కోటవురట్ల: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఉత్కంఠభరితంగా సాగుతున్నాయి. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ చూపుతున్నారు. శుక్రవారం విద్యార్థినులకు ఖోఖో, కబడ్డీ నిర్వహించారు. కోటవురట్ల, జల్లూరు, కె.వెంకటాపురం, పాములవాక గ్రామాల నుంచి విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొని సత్తా చాటారు. హెచ్ఎం ఎం.లక్ష్మి, పీడీలు గణేష్, దాసు, అచ్యుతరావు, లక్ష్మి, విజయకుమారి, బాబు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం: కొరుప్రోలు ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ శుక్రవారం ఉత్సాహంగా సాగాయి. మండల స్థాయి పోటీల్లో సుమారు 15 ఉన్నత పాఠశాలల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో తదితర క్రీడలతో పాటు, ఈవెంట్స్ పోటీలు కూడా నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

ఏటికొప్పాకలో వ్యాస రచన పోటీలు

యలమంచిలి రూరల్: స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా యలమంచిలి మండలం ఏటికొప్పాక జెడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పారిశుధ్యం, పరిసరాల పరిశుభ్రత-ప్రాధాన్యతపై నిర్వహించిన ఈ పోటీలో విద్యార్థులు ప్రతిభకనబరిచారు. విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం గ్రామంతో పాటు ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని వ్యర్థాలను తొలగించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ భజంత్రుల లక్ష్మి, ఈవోపీఆర్డీ ప్రసాద్, ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ఏటికొప్పాకలో వ్యాసరచన పోటీలో పాల్గొన్న విద్యార్థులు